

# 2 వేట కథ

మర్నాడు సుబ్బరాజు వచ్చి కూర్చోబోతుండగానే రామిరెడ్డిగారు కథ అరంభించారు. అనగనగా ఒహా రాజ్యంలో ఒహా తిరుపతయ్య ఉండేవాడు. కొంచెం పొగరు మోతుబరి. ఒహా మారాయన ఆ ఊరి ఇస్కూలు మీదికి షైరెళ్ళాడు. అక్కడ వీర్రాజని ఒక మేష్టరు పిల్లలకు ఆటల్జెబుతూ ఒకణ్ణో దెబ్బ వేశాడు. తిరపతయ్య అది చూసి అదేవిటని మేష్టర్ని గద్దించాడు. మజ్జెన్నీ కేవిటన్నాడా మేష్టరు. తిరపతయ్యా మండిపడ్డాడు. వయసు మీదున్నాడేమో ఆ మేష్టరూ గయ్‌మని లేచాడు. తిరపతయ్య జబర్దస్తీగా ముందుకురికి వీర్రాజు దవడ మీద సాచి కొట్టాడు. దిమ్మ తిరిగిపోయింది. మాటకు మాట ఎదురాడాడు గాని దెబ్బకు దెబ్బ కొట్టే జెబ్బపుష్టి లేదు వీర్రాజుకు. గుడ్లనీరు గక్కుకుని జెమా జెట్టీలా ఉన్న తిరపతయ్యకేసి చూస్తూ నిలబడిపోయాడు. ఇదంతా ఆయన్ను వలసిన ఓ పంతులమ్మ కంటబడింది. ఆవిడ లబోదిబోమని నలుగుర్నీ పిలిచింది. రసాభాసయింది.

ఏదో పాడుకూత గూసుంటాడు. లేకపోతే తిరుపతయ్య వంటి పెద్దమనిషి ఉత్త పున్యానికి చెయి చేసుకుంటాడా అన్నాడొక పెద్ద. తిరపతయ్య ఆ ముక్క దొరకబుచ్చుకుని మర్నాలుగు కల్పించి గొడవ చేశాడు.

నాలుగు రోజులు చర్చలు జరిపాక ఇంత పొగరుమోతు మేష్టరుంటే పిల్లల్చెడిపోతారని చెప్పి అతన్ని తీసేశారు పనిలోనుంచి.

ఆరోజున వీర్రాజు పగబట్టాడు – తిరపతయ్య మీద. ఓరోజున నీకూ ఉద్యోగం పోగొడతా జూడు అని పట్నం వెళ్ళి అష్టకష్టాలూ పడి ప్రైవేట్లు చెప్పుకుంటూ పైకి చదివాడు. నాలుగేళ్ళ తరవాత ఉద్యోగం సంపాయించాడు. రెవిన్యూ ఆఫీసులో చేరి తిరపతయ్య పొలాల మీద చెక్కింగుకొచ్చి నానా అల్లరీ పెట్టాడు. ఇతనూ వీర్రాజు ఊహ తెలిసి, నీ పనైబుతానుండని ఫిర్యాదులు రాశాడు. పని జరగలేదు. ఇలాక్కాదెవారమని ఊళ్ళో నిర్వాకం తండ్రి నెత్తినబడేసి పట్నం వెళ్ళి లంచాలు పెట్టి ఆ ఆఫీసులోనే ఉద్యోగం సంపాయించాడు. వీర్రాజు జాగ్రత్తపడి డిపార్టుమెంటు పరీక్షలు పాసై పై అధికారిగా వచ్చి తిరుపతయ్యను మన్యం బదిలీ చేయించాడు. ఇంకో రెణ్ణెల్లకు అక్కడ తనిఖీకి వెళ్ళి అతన్ని డిస్మిసు చేయించడానికి సన్నాహాలు

చేసుకున్నాడు. తిరపతయ్య భయపడి సెలవు పెట్టి, సెలవు తీరేసరికి మరో ఆఫీసుకు వేయించుకున్నాడు. వీర్రాజు కొద్దికాలంలోనే అక్కడ ఆఫీసరుగా వెళ్ళాడు.

ఇది పనిగాదని తిరపతయ్య ఉద్యోగం వదులుకుని చిన్న వ్యాపారం పెట్టాడు. వీర్రాజు టాక్సు ఆఫీసరుగా తయారయ్యాడు. తిరపతయ్యకి విసుగేసి ఇంటికెళ్ళాడు. ఈడనే ఉంటే సరిగదా వాడెక్కడొస్తాడని అన్నదమ్ములన్నా వినక, వాణ్ణి నిభాయించి నిలబెడతానని పంతంబట్టి తన వాటా భూములు తెగనమ్మి అంకినంత అప్పుజేసి పట్నం వెళ్ళి పెద్ద పరిశ్రమ పెట్టాడు. బాగా డబ్బు గడించి, పలుకుబడి సంపాయించాడు. వీర్రాజు ఉద్యోగం వదులుకుని, ఆ ఫ్యాక్టరీలో వర్కర్ల చేత యూనియన్ కట్టించి నాయకుడయ్యాడు. అతను ఏ అఘాయిత్యం చెయ్యకపోయినా తిరపతయ్య భయపడి మునిసిపల్ ఎలక్షనుకు నిలబడి ఛైర్మనుగా ఎన్నికయ్యాడు. అతన్తో పోటీగా వీర్రాజు నిలబడి ప్రతిపక్షంలో కౌన్సిలర్ అయ్యాడు.

అతని బాధలు పడలేక దినదిన గండాల్లాంటి ఛార్జీలూ, తీర్మానాలూ తట్టుకోలేక తిరపతయ్య పైకి జరిగాడు. ఎమ్మెల్యే అయ్యాడు.

నాలుగేళ్ళ తరవాత వీర్రాజు అంత పని సాధించేసరికి తిరపతయ్య మినిష్టరై కూర్చున్నాడు...

సుబ్బరాజా, ఇప్పుడు చెప్పు ఓ యేడాది తిరిగేసరికి మొత్తం మీద వీర్రాజు పగ సాధించాడు. తిరపతయ్య పరువుదీసి, పరపతి తిరపతి కంపించి మినిష్టరు గిరీకి రూకలు చెల్లేలా చేశాడు. ఎలా చేశాడంటావు?

"ప్రతిపక్షంలో చేరి దర్యాప్తులు చేసి దుమ్మెత్తి పోశాడా? ఆరోపణలు తెచ్చి నిరూపించాడా? పత్రిక పెట్టి ఏకి వదిలిపెట్టే పరువు తీశాడా? ఎమ్మెల్యే లందరినీ మాయజేసి అవిశ్వాస తీర్మానం తెప్పించాడా? చెప్పు చూద్దాం" అన్నాడు రామిరెడ్డిగారు.

"ఇవేవీ కాదు. ఈ విద్యకి ప్రతి విద్యలు తిరుపతయ్యకూ తెలిసుంటాయి. వీర్రాజు తిరుపతయ్య పార్టీలోనే చేరి, అతనితోనే నేస్తం కట్టి, అన్నిటికీ వంతపాడి నీ అంతవాడు లేడని మెరమెచ్చులు పలికి, పొగడ్తతో నమ్మించి ఉచ్చులో పడేస్తుంటాడు. పొగడ్తలకు పడని వాడుండడు కదా" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారు తృప్తిగా నవ్వి "రేపురా" అన్నాడు.

★ ★ ★